వరి పైరుకు తెగుళ్ల బెడద

- పంటలను కాపాడుకునేందుకు ఖరీదైన పురుగు మందుల పిచికారీ
- ఇప్పటికే రూ.వేలల్లో ఖర్చు
- ఆందోళనలో అన్నదాతలు
- పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు, అధికారులు
- నివారణకు అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి



తెగుళ్లు సోకిన వరి పైరుకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్/కమాన్‌పూర్/ఎలిగేడు: అన్నదాతలను కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. పంటవేసింది మొదలు చేతికందే వరకు ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొంటున్నారు. యాసంగిలో పంటల సాగుకు శ్రీకారం చుట్టిన మొదట్లోనే చుక్కెదురవుతోంది. జిల్లాలో వరిసాగుచేసిన 15 రోజుల్లోనే పంటలకు తెగుళ్ల సోకుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పురుగు మందుల పిచికారీకి అధిక వ్యయంచేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. వరిపైరుకు వివిధ రకాల తెగుళ్లు సోకి పంటల్లో ఎదుగుదల లేక రైతులు పంటను కాపాడుకునేందుకు నానాకష్టాలు పడుతున్నారు. యాసంగిలో వరినాట్లు ప్రస్తుతం చివరి దశకు చేరాయి, ఎన్నో ఆశలతో వరి సాగుచేసిన పంటలకు మొదట్లోనే తెగుళ్లు ఆశించడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వరినాట్లు పూర్తికాకముందే వరి పంటలో మొగిపురుగు, జింకులోపం రైతులను ఉక్కిరి, బిక్కిరి చేస్తోంది. ఒకేసారి తెగుళ్లు ఆశించడంతో ప్రారంభదశలోనే సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఈక్రమంలో ఎరువుల షాపులకు వెళ్లి రూ.వేలల్లో ఖర్చుచేసి పురుగు మందులు కొనుగోలు చేస్తున్నారు. ఇంత ఖర్చుచేసి పంటలపై స్ప్రే చేయిస్తున్నా ఫలితం లేకుండా పోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నాట్లువేసిన అనతికాలంలోనే రూ.వేలల్లో పెట్టుబడులు పెడుతున్నామని అయినా ఫలితం కన్పించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొగిపురుగు, జింక్ లోపం

సాగుచేసిన వరిపంటలపై మొగి పురుగు ఆశించడంతో పాటు జింక్ లోపం, చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో పంటలు తెగుళ్ల సోకుతున్నాయి. నాట్లువేసి 20 రోజులైనా వరిపీకలు పచ్చపడగా ఎర్రబారిపోతూ చనిపోతున్నాయి.

6వేల ఎకరాల్లో వరిసాగు

కమాన్‌పూర్ మండలంలోని తొమ్మిది గ్రామపంచాయతీల పరిధిలో రైతులు ఆరువేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటి విడుదలతో పాటు వ్యవసాయ బావులు, బోర్లల్లో పుష్కలంగా నీరుఉండడంతో వరిసాగు వైపు మొగ్గుచూపి దొడ్డు రకం వరి సాగుచేశారు.

పొలంబాట పట్టిన ఎమ్మెల్యే



వరినాట్లు వేసిన తర్వాత పంటకు మొగిపురుగు సోకి ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో పెద్దపల్లి మండలంలోని పలు గ్రామాల్లో రైతుల సమస్యలు తెలుసుకునేందుకు పొలంబాట పట్టారు. జిల్లా వ్యవసాయ అధికారులతో కలిసి పర్యటించి రైతులకు సలహాలు, సూచనలు అందించారు.

వరిపై తెగుళ్ల పంజా

వరిపంటలో సల్ఫైడ్ ఇంజ్యూరీతో పాటు మొగిపురుగు, ఆకుముడుచు పురుగులు వ్యాప్తిచెందుతున్నాయి. వాతావరణంలో మార్పులతో తెగుళ్ల సోకుతున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఆకుముడుచు పురుగు ఆకులను తినేస్తోంది. రెండు, మూడు ఆకుల్ని దగ్గరగా చుట్టి లోపలిభాగాన్ని మింగేస్తోంది. మొగిపురుగు, ఆకుముడుచు పురుగు వంటి తెగుళ్ల నివారణకు రైతులు పురుగు మందుల ను పిచికారి చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. సస్యరక్షణ చర్యలతో పెట్టుబడి ఖర్చులు మరింత పెరుగుతుండగా, పంట దిగుబడిపై ప్రభావంచూపుతుందని వాపోతున్నారు.

జిల్లాలో ఇలా...

యాసంగి సీజన్‌లో మొత్తం 2,07,542 ఎకరాల్లో వరిసాగు చేయనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. భూగర్భజలాల వృద్ధితో పాటు నీటి వనరులు జలకళ సంతరించుకుని సాగునీరు సమృద్ధిగా ఉంది. దీంతో రైతులు ఎప్పటిలాగే ఈసారి కూడా వరిసాగుకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 1.87 లక్షల ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయి. పెద్దపల్లి జిల్లాలో యాసంగిలో 1,83,500 ఎకరాల్లో వరిసాగైంది. ఈ మొగిపురుగు పిలకదశలో.. నాటు దశలోనూ కనిపిస్తోందని రైతులు అంటున్నారు. 10 రోజులుగా కాండం తొలిచే పురుగు, రెక్కల పురుగులు గుడ్లు పెట్టినట్లు గుర్తించారు. పిలకదశలో కాండం తొలిచే పురుగు ఉధృతి ఎక్కువగా ఉంది.

తెగుళ్లతో రైతుల్లో ఆందోళన....

ఎలిగేడు మండలంలోని 12 గ్రామాల్లో ఈ యాసంగిలో 14,500 ఎకరాల్లో వరిసాగుచేస్తారని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేయగా ఇప్పటివరకు 12వేల ఎకరాలకుపైగా వరినాట్లు పూర్తయ్యాయి. వ్యవసాయబావులు, చెరువులు, కుంటలు, ఎస్సారెస్పీ డి–86 ఆయకట్టు, ఎస్సారెస్పీ నీరు సైతం విడుదల చేయడంతో రైతులు 90 శాతం మంది రైతులు వరి సాగుచేస్తున్నారు. ఇప్పటివరకు 85 శాతం వరినాట్లు పూర్తికాగా పలురకాల తెగుళ్లతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అన్ని గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారి ఎం.ఉమాతి ఆధ్వర్యంలో ఏఈవోలు పర్యటించి వరి పంటలో ఆశిస్తున్న తెగుళ్లను పరిశీలించారు. తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరిస్తున్నారు.

ఉధృతంగా ఉంది



వరిపైరుకు మొగిపురుగు ఉధృతి చాలా ఎక్కువగా ఉంది. ఇప్పటికే రెండుసార్లు మందులు చల్లాం. అయినా తగ్గలేదు. తెగుళ్ల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కదారి కొమురేశ్, బొంపల్లి

తెగుళ్లు పోవడం లేదు



వరి నాటు వేసిన 20రోజులైంది. పంటలో మొగిపురుగు సోకి పంట ఎర్రబారుతోంది. ఖరీదైన మందు కొట్టిస్తున్న తెగుళ్లు పోవడంతో లేదు. పెట్టుబడి భారం పెరిగింది.

– ఆకుల మల్లయ్య, రైతు, కిష్టంపల్లె

ఐదెకరాలకు తెగుళ్లు



యాసంగిలో ఐదెకరాల్లో వరి నాట్లు వేశాను. మొగిపురుగు సోకి వరి పాడైంది. దాదాపు రూ.75వేల నష్టం వాటిల్లింది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– పర్శురాములు గౌడ్, రైతు, ధూళికట్ట, ఎలిగేడు

ప్రభుత్వం ఆదుకోవాలి



వరిపంటలకు మొగి పురుగు సోకి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. అధికారులతో సర్వేచేయించి పరిహారం ఇవ్వాలి. నాలుగు ఎకరాల పొలం ఎండిపోయింది రూ.60 వేల నష్టం వాటిల్లింది. – భూసారపు శ్రీకాంత్, యువరైతు

ఎకరాకు రూ.2వేల ఖర్చు



పంటకు తెగులు సోకిందని అధికారులకు వద్దకు వెళితే మందులు రాసిచ్చారు. ఎకరాకు రూ. 2వేల వరకు ఖర్చుఅవుతోంది. మందులు కొట్టేందుకే ఈ ఖర్చవుతుంది. ముమ్ముందు పెట్టుబడికి మరింత ఖర్చవుతుంది.

– జంగోని సదయ్యగౌడ్, రైతు, తోగార్రాయి

రైతులు అప్రమత్తంగా ఉండాలి

రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలి. వారం రోజులుగా కాండం తొలిచే పురుగు, రెక్కల పురుగుల గుడ్ల సముదాయాలు గమనించాం. ఈ ఏడాది పిలక దశలో కాండం తొలిచే పురుగు ఉధృతి ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. రైతులు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలి.

– ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి, పెద్దపల్లి

క్లుప్తంగా

జగిత్యాల మున్సిపల్ చైర్మన్‌కు అండగా ఉంటాం



మున్సిపల్ చైర్మన్‌తో గుండేటి రాజేశ్

కోల్‌సిటీ: జగిత్యాల మున్సిపల్ చైర్మన్ భోగ శ్రావణికి అండగా ఉంటామని పెద్దపల్లి జిల్లా పద్మశాలీ సేవా సంఘం ఉపాధ్యక్షుడు గుండేటి రాజేశ్ అన్నారు. ఆదివారం మున్సిపల్ చైర్మన్ శ్రావణిని కలిసి మద్దతు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ శ్రావణిని అవమానించి, మనస్థాపానికి గురిచేసిన ఎమ్మెల్యే సంజయ్ క్షమాపణ చెప్పాలని, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెయ్యాలని రాజేశ్ డిమాండ్‌చేశారు. పద్మశాలీలను దూషించినా, కించపరిచినా సహించేది లేదని హెచ్చరించారు. చైర్మన్‌ను కలిసిన వారిలో గోదావరిఖనికి చెందిన రాష్ట్ర జాతీయ చేనేత ఐక్యవేదిక యువజన సహాయ కార్యదర్శి మాటేటి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి

మంథని: వ్యక్తిగత దూషణలు మానుకొని, ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలని కాంగ్రెస్ బీసీ సెల్ మంథని నియోజకవర్గ అధ్యక్షుడు గోటికార్ కిషన్, మండల అధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బండారి ప్రసాద్ బీఆర్‌ఎస్ నాయకులను డిమాండ్ చేశారు. బహుజనవాదం అంటూ ప్రజల్ని మోసం చేసే ప్రయత్నాలు మానుకోవాలని ఈ ప్రాంత ప్రజలు అన్ని గమనిస్తున్నారన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న రఘువీర్‌సింగ్

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్‌లో దేవసాని బుచ్చమ్మ (75) వారంక్రితం అనారోగ్యంతో మృతిచెందగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ ఆదివారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట ధూళికట్ట, జూలపల్లి సింగిల్‌విండో చైర్మన్లు వేణుగోపాల్‌రావు, వెంకటయ్య ఉన్నారు.

మైక్‌సెట్ వితరణ



మైక్‌సెట్ అందిస్తున్న ట్రస్టు సభ్యులు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో గౌడ కులస్తుల ఆరాధ్యదైవమైన రేణుకా ఎల్లమ్మ పట్నాల సందర్భంగా ఆలయానికి ఏగోలపు కుమార్‌గౌడ్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు అధ్యక్షుడు సదయ్యగౌడ్ మైక్‌సెట్‌ను ఉచితంగా అందించారు. గౌడసంఘం అధ్యక్షులు నర్సయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు వెంకటేశంగౌడ్ కార్యవర్గసభ్యులు నాయకులు గౌడకులస్థులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ సతీశ్

ముత్తారం: మండలంలోని మచ్చుపేటలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ సతీశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మచ్చుపేట, శుక్రవారంపేట గ్రామాల్లో విద్యుత్ సరాఫరాకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వార్డుసభ్యులు తీర్మాణించామన్నారు. దీంతో విద్యుత్ శాఖ ఏడీ, ఏఈలను సంప్రదించగా స్తంభాలు ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి సహకరించిన విద్యుత్‌శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు గ్రామస్తులు బూర్ల రాజేందర్, పందిళ్ల రాజయ్య, సతీశ్, రాజ్‌కుమార్ ఉన్నారు.

కార్మికులకు ఇళ్ల స్థలాలివ్వండి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో నివసిస్తున్న అసంఘటిత కార్మికులు, నిరుపేదలకు ఇళ్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. సోమవారం నుంచి వార్డులవారీగా సర్వే నిర్వహించి ఫిబ్రవరి 3వ తేదీ వరకు తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులు అందించాలని నాయకులకు సూచించారు. ఫిబ్రవరి 9న జరిగే చలో హైదరాబాద్‌కు తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు భిక్షపతి, జ్యోతి, రామాచారి అంజయ్య, అరవింద్, వెంకటస్వామి, ఖాజా, మహేశ్, లచ్చయ్య, నందిని, రామలక్ష్మి, కృష్ణకుమారి తదితరులున్నారు.

ప్రజలు మరో భూ పోరాటానికి సిద్ధం కావాలి



మాట్లాడుతున్న కనకరాజ్

గోదావరిఖని: ఇళ్లు, ఇళ్లపట్టాల కోసం ప్రజలు మరో భూ పోరాటానికి సిద్ధం కావాలని సీపీఐ నగర కార్యదర్శి కనకరాజ్ అన్నారు. ఆదివారం స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో మంద కొమురమ్మకాలనీ వాసులతో సమావేశమయ్యారు. ఇళ్లు లేని నిరుపేద దళితులు 2017లో జీఎం కార్యాలయం సమీపంలో ఇళ్లు నిర్మించుకోగా.. ప్రభుత్వం తొలగించిందని, అప్పటినుంచి ఇళ్లు లేక దళితులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వారికి న్యాయం జరిగే వరకూ సీపీఐ వెన్నంటి ఉంటుందన్నారు. ప్రజాసంఘాల నాయకులు గౌతం గోవర్దన్, శనిగరపు చంద్రశేఖర్, వై.లెనిన్, గౌస్, రేణికుంట్ల ప్రీతం, నవీన్, మందకొమురమ్మ కాలనీ నాయకుడు రాసపల్లి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల్లో కార్మికులు ముందుండాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గోదావరిఖని: సమరశీల పోరాటాల్లో కార్మికులు ముందుండాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.క్రిష్ణ సూచించారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో 11వ రాష్ట్ర మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. సింగరేణి కార్మికుల సమస్యలు, హక్కుల పరిరక్షణకు నాలుగు దశాబ్దాలుగా ముందుకెళ్తున్నామని, వచ్చేనెల 4న నిర్వహించే 11వ మహాసభలకు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, ఎం.కొమురయ్య, ఎండీ. యూసుఫ్, ఎస్‌సీ.బాబు, పి.మొండన్న, చింతల శేఖర్, ఐ.సాంబయ్య, ఎస్.రాజన్న, సిహెచ్ అబేద్నేగో, బి.రమేష్, ఎస్.మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ప్రైవేట్ డ్రైవర్లకు స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రైవేట్ కన్వెంట్ డ్రైవర్లకు స్కిల్డ్ వేతనాలు అమలుచేయాలని సీఐటీయూ ఆర్జీ–2 డివిజన్ కార్యదర్శి ఉల్లి మొగిలి డిమాండ్‌చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో మాట్లాడారు. వాహన యజమానులు జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని, వారి సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు భూమయ్య, నాయకులు సదానందం, లక్ష్మీనారాయణ, వేణు, రామన్న, సతీశ్, శేఖర్, లక్ష్మణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రామగుండం బల్దియాలో శాంతిపూజలు

- మేయర్ సమక్షంలో కాంట్రాక్టర్ల ప్రత్యేక పూజ
- ప్రాంగణంలో జంతుబలి చేయడం వివాదాస్పదం
- కార్యాలయం ప్రాంగణంలో మద్యం బాటిళ్లు
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఘటన
- వాస్తవాలపై ఆరా తీసిన ఏసీపీ, స్థానిక పోలీసులు



బల్దియా ఆవరణలో శాంతిపూజలు



ప్రాంగణంలో మేకతో కాంట్రాక్టర్లు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో ఆదివారం వేకువజామున కాంట్రాక్టర్లు శాంతిపూజలు, జంతుబలి చేయడం, మద్యం బాటిళ్లు ఉండడం దుమారం లేపింది. బల్దియా ఆవరణలో పూజల పేరుతో మేకలను బలిఇచ్చారని సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్ వన్‌టౌన్ రెండో సీఐ ప్రసాద్‌రావు వాస్తవాలపై ఆరా తీశారు. పలువురు కాంట్రాక్టర్లు, మేయర్‌తో నేరుగా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారని తెలిసింది.

బల్దియాకు కీడు సోకిందని..

బల్దియాకు చెందిన ఇద్దరు సివిల్ కాంట్రాక్టర్లు ఇటీవల కాలంలో గుండెపోటుతో మృతిచెందారు. మరో సీనియర్ కాంట్రాక్టర్ గడ్డి కనకయ్య కూడా ప్రమాదంలో మరణించడం, పలువురు కాంట్రాక్టర్లు అనారోగ్యాలకు గురి కావడంతో నగరపాలక కార్యాలయానికి కీడు సోకిందని, శాంతిపూజలు నిర్వహించాలని కాంట్రాక్టర్లు నిర్ణయించుకున్నారు.

మేయర్ సమక్షంలో..

బల్దియా ఆవరణలో ఆదివారం వేకువజామున నగర మేయర్ బంగి అనిల్‌కుమార్ సమక్షంలో కాంట్రాక్టర్లు పూజారితో శాంతిపూజలు నిర్వహించారు. పూజలో భాగంగా మేయర్‌తో గుమ్మడికాయను పగులకొట్టించారు. పూజ అనంతరం కార్యాలయానికి వచ్చే రెండు ప్రధాన ముఖద్వారాల వద్ద నాలుగు మేకలను బలి ఇచ్చారు. కాగా, ప్రభుత్వ కార్యాలయంలో జంతుబలి చేయడం, శాంతిపూజలకు మేయర్ హాజరుకావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శాంతిపూజలు, జంతుబలి, కార్యాలయం వెనుక ఓపెన్‌జిమ్ ప్రాంతంలో మద్యం బాటిళ్లు వెలుగు చూడడం వివాదస్పదమైంది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో రక్తపు మరకలను కాంట్రాక్టర్లు హుటాహుటిన ట్యాంకర్ నీళ్లతో కడిగించారు. కాగా గోదావరిఖని ఏసీపీ బల్దియాలో జరిగిన వాస్తవాలపై ఆరా తీసి పోలీసు ఉన్నతాధికారులకు నివేదించారని సమాచారం.

పోచమ్మ బోనాలు

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌లో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో శోభాయత్రగా వెళ్లి ఆలయంలో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జెడ్పీటీసీ లక్ష్మణ్ హాజరై మొక్కులు సమర్పించారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



సాధించిన పతకాలతో విద్యార్థులు

ధర్మారం: జాతీయస్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో ధర్మారం విద్యార్థులు ప్రతిభ కనబర్చి బంగారు, వెండి పతకాలు సాధించినట్లు అకాడమీ ఫౌండర్ రాజమల్లు తెలిపారు. హైదరాబాద్‌లోని జీడిమెట్లలో ఆదివారం డ్రాగన్ స్వార్డ్ కుంగ్‌ఫూ జాతీయస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ధర్మారం గ్రామానికి చెందిన విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారు. కటాస్ విభాగంలో వినయ్, స్నిగ్ధ, గణేశ్, ఇంద్రప్రియదర్శిని, దినేశ్, రితేశ్ బంగారు పతకాలు సాధించగా, సిద్దార్థ, సత్యత్రివేద్, వెండి పతకాలు, దీక్షిత్, విష్ణువర్ధన్ కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు.

క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు పోటీలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు నిర్వహిస్తున్నట్లు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, ఏసీపీ గిరిప్రసాద్ పేర్కొన్నారు. కోరుకంటి ప్రీమియర్ లీగ్ కేటీఆర్ గోల్డ్‌కప్ పోటీలు ఆదివారం స్థానిక జవహర్‌లాల్ స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయు. పోటీలను ఎమ్మెల్యే చందర్, ఏసీపీ గిరిప్రసాద్ హాజరై ప్రారంభించారు. యువతలో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకు మంత్రి కేటీఆర్ స్ఫూర్తితో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతగా నిలిచిన జట్టుకు రూ.లక్ష, రన్నరఫ్‌కు రూ.50వేలు, మూడు, నాలుగో స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.10వేల చొప్పున నగదు బహుమతి అందిస్తామన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, వన్‌టౌన్ రెండో సీఐ ప్రసాద్‌రావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వంశీ, ప్రధాన కార్యదర్శి పూదరి కుమార్, కోశాధికారి దయానంద్ గాంధీ, మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ఎన్‌సీసీ ఏ–సర్టిఫికెట్ పరీక్షలు



పరీక్షలకు హాజరైన ఎన్‌సీసీ విద్యార్థులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం సెయింట్ క్లేర్ హైస్కూల్‌లో ఎన్‌సీసీ–ఏ సర్టిఫికెట్ అర్హత పరీక్షలకు పలువురు విద్యార్థులు హాజరయ్యారు. ఆదివారం పీటీఎస్‌లోని హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి హవల్దార్ కమల్, మల్లయ్య పూజారి, ఎన్‌సీ సీ అధికారి బి.సంజయ్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్‌సీసీ–ఏ సర్టిఫికెట్ పరీక్షలు నిర్వహించారు. ఎన్టీపీసీ ప్రాంతంలోని సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, సెయింట్ క్లేర్ హైస్కూల్, కేంద్రీయ విద్యాలయం గోదావరిఖనిలోని సాక్రెడ్ హార్ట్ హైస్కూల్, సింగరేణి స్కూల్‌కు చెందిన 153మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రామగుండం: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనకు ఉద్యమించి ఎన్నో కేసుల్లో జైలు పాలై ఆర్థికంగా, సామాజికంగా నష్టపోయిన ఉద్యమకారులను తెలంగాణ స్వాతంత్ర సమరయోధులుగా గుర్తించాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాడ నారాయణరెడ్డి కోరారు. ఆదివారం అంతర్గాంలో ఏర్పాటు చేసిన సమావేశంలోమాట్లాడారు. మానుకోట ప్రతిఘటన, మిలియన్ మార్చ్, సహాయ నిరాకరణ, సకలజనుల సమ్మె తదితర ఉద్యమాల్లో దాదాపు 1,200 మంది ఆత్మబలిదానాలు చేసుకున్నారన్నారు. వారి కుటుంబాలతో పాటు ఉద్యమంలో పాల్గొని కేసులు, జైలుపాలైన వారినిగుర్తించి స్వాతంత్ర సమరయోధులకు వర్తించే పథకాలను వర్తింపజేయాలని కోరారు. ప్రస్తుతం జార్ఖండ్ రాష్ట్రంలో ఉద్యమకారులను గుర్తించి పెన్షన్ అమలు చేస్తున్నారన్నారు. ఉద్యమకారులకు రాబోయేబడ్జెట్‌లో రూ.10వేల కోట్లతో సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పెన్షన్, బస్సు, రైల్వేపాస్‌లు, ఆరోగ్యకార్డులు, 300 గజాల స్థలం కేటాయించాలని, ప్రభుత్వోద్యోగాల్లో విద్యార్థి ఉద్యమకారులకు కోటా కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో ఫోరం ప్రతినిధులు అంగోతు శంకర్‌నాయక్, గోసిక తిరుపతి, ఒల్లెపు సారయ్య, ఆలకుంట సంపత్, వేముల రాజ్‌కుమార్, బానోతు సురేష్, మామిడాల రవీందర్, మల్లేష్ తదితరులున్నారు.

మానేరులో ఇసుక తవ్వకాలు నిలిపి వేయండి



మాట్లాడుతున్న శశిభూషణ్ కాచే

మంథని: మానేరులో ఇసుక తవ్వకాలపై జాతీయ హరిత ట్రిబ్యూనల్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు అమలు చేయాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ శశిభూషణ్ కాచే డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. మానేరులో ఇసుక తవ్వకాలు నిలిపివేస్తున్నట్లు టీఎస్ఎండీసీ అధికారులు ప్రకటించినా.. పొక్లెన్ ద్వారా డంప్ యార్డులకు తరలిస్తున్నారని ఆరోపించారు రామగుండం సీపీ ఈ విషయంలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు కాంట్రాక్టర్లకు మేలు జరిగేలా సంబంధిత అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్, నాయకులు వొడ్నాల శ్రీనివాస్, మంథని సురేష్, మద్దెల రాజయ్య, బూడిద శంకర్, మంథని శ్రీనివాస్, రాంరాజశేఖర్, తదితరులు ఉన్నారు.